క్లుప్తంగా

రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు ఎస్‌బిజీ నగర్‌లో రోడ్లు, కాలువల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈమేరకు శనివారం కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌బిజీ నగర్‌లో రూ.22 లక్షల జీవీఎంసీ నిధులతో రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 9 మంది గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలోని రెండు కేంద్రాల్లో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎకనామిక్స్, ఫిజిక్స్ పరీక్షలకు 9 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్లు తెలిపారు. కృష్ణా జూనియర్ కళాశాలలోని సెంటర్–ఏలో 655 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. ఏడుగురు గైర్హాజరు కావడంతో 648 మంది రాశారని చీఫ్ సూపరింటెండెంట్ నాగమణి తెలిపారు. డిగ్రీ కాలేజీలోని సెంటర్–బీలో పరీక్షకు 674 మంది హాజరు కావాల్సి ఉండగా.. వీరిలో ఇద్దరు గైర్హాజరై.. 672 మంది పరీక్ష రాశారని చీఫ్ సూపరింటెండెంట్ ఆర్.వి.వి.సూర్య కుమారి చెప్పారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వారు పేర్కొన్నారు.

ప్రసాద్ పథకం పనులు వేగవంతం చేయండి


ఎంపీ ఎంవీవీని సత్కరిస్తున్న శ్రీనుబాబు

ఎంవీపీకాలనీ: ప్రసాద్ పథకం ద్వారా సింహాచలం దేవస్థానానికి తొలి విడతగా అందించిన రూ.54 కోట్లతో అభివృద్ధి పనుల వేగవంతానికి కృషి చేయాలని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కోరారు. ఈ మేరకు శనివారం లాసన్స్ బేకాలనీలోని కార్యాలయంలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంట్ల మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం ద్వారా సింహాచలం దేవస్థానంలో పనులకు మంజూరు చేసిన రూ.54 కోట్ల నిధులతో రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక శాఖ ద్వారా పనులు నిర్వహించాల్సి ఉందన్నారు. వీటిని వేగం పెంచే దిశగా కృషి చేయాలని ఎంపీని కోరారు. దీంతోపాటు రెండో విడత నిధుల మంజూరుకు కృషి చేయాలన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ ఎంవీవీ తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు శ్రీనుబాబు తెలిపారు.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం

సీతంపేట: బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అంబేడ్కర్) పని చేస్తుందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉత్తరాంధ్ర జిల్లాల విస్తృత స్థాయి సమావేశం శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయినప్పటికీ ఇంకా అసమానతలు, అణచివేతలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో దళిత, బహుజనులకు అన్యాయం జరుగుతోందని, రాజ్యాంగ లక్ష్యాలైన స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయాలకు విఘాతం కలుగుతుందని చెప్పారు. 1919లో మొదలైన అంబేడ్కర్ పోరాటం 1950 వరకు 37 ఏళ్ల పాటు కొనసాగిందని, ఆయన స్ఫూర్తితో రిపబ్లికన్ పార్టీ పని చేస్తుందన్నారు. సమావేశంలో ప్రొఫెసర్లు పి.డి.సత్యపాల్, సి.ప్రజ్ఞ, మాటూరి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.డేవిడ్‌రాజ్, కార్యదర్శి ఇంటి గురుమూర్తి, ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ కొంగరాపు గణపతి, తుమ్మిడి రామ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

కైలాసగిరికి మరిన్ని హంగులు

- శివపార్వతుల విగ్రహాలకు కొత్త రంగులు
- కొండపై ఆకర్షణీయంగా పార్కులు, రోడ్లు
- విదేశీ అతిథులు, పర్యాటకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు


కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహాలకు రంగులు వేస్తున్న సిబ్బంది


కర్షణీయంగా తయారు చేస్తున్న శివపార్వతుల పార్కు


కొండపై కొత్త రంగులతో సిద్ధం చేస్తున్న ఆర్చి


సిద్ధం చేసిన పిల్లల ఆటపరికరాలు


శంకు చక్రాల పార్కులో పచ్చదనం కోసం అమర్చుతున్న లేన్‌లు

ఆరిలోవ: నగరంలో ప్రధాన పర్యాటక కేంద్రంగా నిలిచిన కైలాసగిరి రూపురేఖలు మారుతున్నాయి. జీ20 సదస్సులో భాగంగా విదేశీ అతిథులను ఆకట్టుకునేలా వీఎంఆర్‌డీఏ మెరుగులు దిద్దుతోంది. విశాలాక్షినగర్ కూడలి వద్ద ప్రారంభమైన ఘాట్ రోడ్డు నుంచి కొండపైన తెలుగు మ్యూజియం వరకు తారు రోడ్డు, దాని పక్కన గోడలకు వేసిన రంగులు ఆకట్టుకుంటున్నాయి. కైలాసగిరి కొండపై ఉన్న శివపార్వతుల విగ్రహాలకు ఇంతవరకు తెల్లని రంగు మాత్రమే ఉండేది. ఇప్పుడది మారుతోంది. బంగారం రంగు ఆభరణాలు, కాషాయం రంగు రుద్రాక్షలు వేశారు. వీటితోపాటు ఈ విగ్రహాలకు మరి కొన్ని రంగులు వేసి అతిథులతోపాటు పర్యాటకులను ఆకట్టుకునేలా తయారు చేస్తున్నారు.

ఘాట్ రోడ్డుకు కొత్తదనం..

కైలాసగిరికి వెళ్లే ఘాట్ రోడ్డు, కొండపైన ఆర్చి నుంచి తెలుగు మ్యూజియం వరకు ఉన్న రోడ్డు బాగు చేసి తారుపూసి కొత్తదనం తీసుకొచ్చారు. ఈ రహదారి పక్కన రక్షణ గోడకు రంగులు వేశారు. కొండపై ఉన్న ఆర్చికి రంగులు వేసి మధ్య మధ్యలో తీగలు, పచ్చని ఆకులు అమర్చి సుందరంగా మారుస్తున్నారు.

పార్కుల్లో పచ్చదనం

కొండపై అన్ని పార్కులు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. సందర్శకులు సేద తీరే అన్ని పార్కుల్లోను పచ్చని లేన్‌లు అమర్చుతున్నారు. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా వీటిని రూపొందిస్తున్నారు. పార్కుల్లో వివిధ రకాల ఆట పరికరాలు సిద్ధం చేశారు. ఇక్కడ శంకుచక్రాలకు సమీపంలోని శిథిలమైన రాతి విగ్రహాల పార్కుకు మెరుగులు దిద్దుతున్నారు. అక్కడి విగ్రహాల మధ్యలో పూల మొక్కలు నాటడానికి ప్రత్యేకంగా సిమెంట్ ఇటుకలతో కుండీలు మాదిరిగా నిర్మించారు. ఇక్కడున్న సర్క్యూట్ ట్రైన్‌కు కూడా జీ20 సదస్సుకు సంబంధించిన పెయింటింగ్, బేనర్లతో ముస్తాబు చేయడానికి సిద్ధమవుతున్నారు. దీనిపై తెన్నేటి పార్కు వైపు, అప్పుఘర్ వైపు, హనుమంతవాక వైపు ఉన్న వ్యూ పాయింట్లను సుందరంగా తయారు చేస్తున్నారు. వీటన్నింటితో మూడు, నాలుగు రోజుల్లో కైలాసగిరి పైకి వెళ్లే సందర్శకులకు మరిన్ని కొత్త అందాలు కనువిందు చేయనున్నాయి.

ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ పరిశీలన


ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ పనుల గురించి తెలుసుకుంటున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను శనివారం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సందర్శించారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుతో కలసి ఆయన ప్లాంట్‌ను పరిశీలించారు. జీ20 సదస్సుకు విచ్చేసే విదేశీ అతిథులు ఈ ప్లాంట్‌ను సందర్శించనున్నారు. దీనికోసం ప్లాంట్‌తోపాటు దాని చుట్టుపక్కల జీవీఎంసీ జరుపుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. వాటి కోసం ఎంత నిధులు ఖర్చు చేస్తున్నారు, ఏఏ పనులు చేపడుతున్నారో ఆరా తీశారు. ఎంతో ఆహ్లాదకరమైన ఈ ప్రాంతంలో విదేశీ అతిథులను ఆకట్టుకునేలా ప్లాంట్‌ను తయారు చేయాలని అధికారులకు సూచించారు. రెండు, మూడు రోజుల్లో ఇక్కడ పనులన్నీ పూర్తి చేయించాలని మంత్రి ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ వినయ్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

నగరంలో సీఎఫ్‌ఏ పరీక్ష కేంద్రం

బీచ్‌రోడ్డు: ఆర్థిక రంగంలో ఉన్నత స్థితిని కోరుకునే వారు చార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్(సీఎఫ్‌ఏ) కోర్సు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని సీఎఫ్‌ఏ ఇన్‌స్టిట్యూట్ హెడ్ ఆర్తి తెలిపారు. విశాఖ నుంచి పెద్ద సంఖ్యలో కోర్సుకు దరఖాస్తులు ప్రతి ఏటా వస్తున్నాయన్నారు. అభ్యర్థుల కోరిక మేరకు ఈ ఏడాది నవంబర్‌లో జరిగే పరీక్షలకు విశాఖలో కేంద్రం కేటాయించామని చెప్పారు. నగరంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు వల్ల రాష్ట్రంలో సీఎఫ్‌ఏ కోర్సు చేయాలనుకునే వారికి మంచి అవకాశం ఉంటుందన్నారు.

రైల్వే భద్రతా దళానికి ద్విచక్ర వాహనాలు


ద్విచక్ర వాహనాలను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్)కు 9 ద్విచక్ర వాహనాలు చేరాయి. వీటిని శనివారం ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సీహెచ్ రఘువీర్‌తో కలిసి డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు. కీలక ప్రాంతాల్లో మరింత ప్రభావవంతంగా, వేగవంతంగా ఆర్పీఎఫ్ సిబ్బంది తమ విధులు నిర్వర్తించేందుకు ఈ వాహనాలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. డివిజన్ పరిధిలోని వివిధ యూనిట్లకు వీటిని అందజేయనున్నారు. కొత్తవలస–కిరండూల్, కోరాపుట్–రాయగడ, రాయగడ–విజయనగరం వంటి సెక్షన్లలోని కొండ ప్రాంతాలు, కీలక ప్రదేశాల్లో ఆర్పీఎఫ్ సిబ్బంది విధుల కోసం ఈ వాహనాలు వినియోగించనున్నట్లు డీఆర్‌ఎం చెప్పారు. ఇవి త్వరగా డివిజన్‌కు చేరడంలో కీలకపాత్రం పోషించిన ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్/ఐజీ పంకజ్ గంగ్‌వార్‌కు వాల్తేర్ డివిజన్ ఆర్పీఎఫ్ సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

స్టాళ్ల ముందు ధరల పట్టీ తప్పనిసరి


ఎంవీపీ రైతుబజార్‌లో రైతులు, వ్యాపారులతో మాట్లాడుతున్న ఈవో ప్రసాద్

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో శనివారం రైతులు, వ్యాపారులతో ఎస్టేట్ ఆఫీసర్ జి.ప్రసాద్ సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ ఆదేశాలతో రైతులకు నియమ నిబంధనలకు వివరించారు. రైతుబజార్‌లో ప్రతి రోజు ఉదయం 6 గంటలకే స్టాళ్లు తెరిచి వినియోగదారులకు అందుబాటులో కూరగాయలు ఉంచాలన్నారు. ప్రతి స్టాల్ ముందు తప్పనిసరిగా కూరగాయల ధరలు స్పష్టంగా కనిపించేలా పట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉదయం 10 గంటల వరకు గృహావసరాల కోసం చిల్లరగా మాత్రమే వినియోగదారులకు కూరగాయలు విక్రయించాలన్నారు. ఇళ్లలో కార్యాలు చేసుకునే వారి అవసరం మేరకు ఎక్కువ కూరగాయలు అమ్మాలనుకునే వారు ముందుగా ఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. స్టాళ్లలో తూనికలు, కొలతలు కోసం సీళ్లు వేసిన కాటాలు మాత్రమే వినియోగించాలని సూచించారు. వ్యర్థాలను చెత్త బుట్టల్లో వేసి రైతుబజార్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రైతులంతా ఈ క్రాపింగ్ నమోదు చేసుకొని దానికి సంబంధించిన సర్టిఫికెట్‌ను ఈవో కార్యాలయంలో అందించాలని చెప్పారు. డ్రాలో కేటాయించిన స్టాళ్లలోనే రైతులు కూరగాయలు విక్రయించాలన్నారు. స్టాళ్లతో సంబంధం లేని ఇతర వ్యక్తులు కూరగాయలు విక్రయిస్తే సదరు స్టాల్ నిర్వాహకుడికి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రైతులకు ఈవో సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరు తోటగరువు విద్యార్థుల ఎంపిక


శ్రావ్య


అఖిలేష్

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఈ ఏడాది నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. ప్రతి ఏడాది ఈ స్కాలర్‌షిప్ కోసం జిల్లా విద్యా శాఖ అధికారులు పరీక్ష నిర్వహిస్తారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు మాత్రమే రాయడానికి అవకాశం ఉంటుంది. ఇందులో ఎంపికైన విద్యార్థులకు తదుపరి తరగతులైన 9, 10, ఇంటర్మీడియట్ వరకు స్కాలర్‌షిప్ వస్తుంది. 2022–23 విద్యా సంవత్సరంలో తోటగరువు హైస్కూల్ నుంచి కె.శ్రావ్య, ఇ.అఖిలేష్ ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.దుర్గాభవాని తెలిపారు. వీరికి వరుసగా నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ వస్తుందని చెప్పారు. వీరు ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో మాత్రమే విద్య కొనసాగించాలన్నారు. వీరితోపాటు 2020–21 విద్యా సంవత్సరంలో ఒకరు, 2021–22 విద్యా సంవత్సరంలో ముగ్గురు విద్యార్థులు తోటగరువు హైస్కూల్ నుంచి ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాది ఎంపికైన ఇద్దరు విద్యార్థులను శనివారం పాఠశాలలో హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు(క్లరికల్/టెక్నికల్) కె.సుధ, సీహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. సుమారు ఏడు లిమిటెడ్ కంపెనీల్లో 345 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ట్రైనీ, పెయింటర్స్, టెక్నీషియన్, సేల్స్, కన్సల్టెంట్స్, టెలీ కాలర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, డెంటర్, క్యాషియర్, ఉద్యోగాల కోసం సుమారు 348 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 98 మంది అభ్యర్థులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు సుబ్బిరెడ్డి తెలిపారు. వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఉపాధి అధికారి సి.ఉమాదేవి, సీహెచ్ కుమారస్వామి, ప్రతినిధులు కృష్ణచైతన్య, లత, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఎంసీ స్నాతకోత్సవం


స్నాతకోత్సవంలో పాల్గొన్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి సోమయాజులు, డాక్టర్ బుచ్చిరాజు



వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జస్టిస్ సోమయాజులు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవం, ఎంబీబీఎస్ 96వ స్నాతకోత్సవం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఘనంగా జరిగాయి. 2017 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, అధ్యాపకులకు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు స్వాగతం పలికారు. రిటైర్డు డీఎంఈ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. శశిప్రభ, ఏఎంసీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్ గౌరవ అతిథులుగా విచ్చేసి వైద్య వృత్తి ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 2017 ఎంబీబీఎస్ బ్యాచ్‌ను అభినందించారు. వైద్యులు మానవతా దృక్పథంతో రోగులకు సేవ చేయాలన్నారు. వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. డాక్టర్ జి. రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ (అడ్మిన్) కొత్తగా ఉత్తీర్ణులైన మెడికల్ గ్రాడ్యుయేట్లతో ప్రమాణం చేయించారు. 2017 బ్యాచ్‌కు చెందిన ఇద్దరు ఉత్తమ విద్యార్థులు డాక్టర్ శ్యామా మదిన్య, డాక్టర్ డి.వైష్ణవి ప్రియాంక అధ్యాపకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ 2017 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిర్మిస్తున్న సెంటినరీ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి రూ. 2 లక్షల చెక్కును అందజేశారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మద్దిపాలెం: మహిళా, శిశు సంక్షేమ ఐసీడీఎస్ 1, 2 పరిధి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అర్బన్–1 సీడీపీవో రమణకుమారి, అర్బన్–2 సీడీపీవో శ్రీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్–1కు సంబంధించి 3 ఆయా పోస్టులు, అర్బన్–2కు సంబంధించి 7 ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు వెల్లడించారు. అర్హత గల అభ్యర్థులు నోటిఫికేషన్, దరఖాస్తు ఫారంను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. నివాస ధ్రువపత్రాలతో దరఖాస్తులు సంబంధిత అర్బన్ కార్యాలయాల్లో ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 3వ తేదీ లోపు సమర్పించాలని సీడీపీవోలు సూచించారు.

ఏయూ విద్యార్థుల ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం


ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఫొటోగ్రఫీ కోర్సులో డిప్లొమా చేస్తున్న విద్యార్థుల వార్షిక ప్రదర్శన ఫ్రేమ్డ్ మూమెంట్స్–2023ని శనివారం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో నిర్వహించిన ఈ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించి విద్యార్థుల ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏయూలో శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులు సొంతంగా వ్యాపార సంస్థను ప్రారంభించడానికి, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌గా రాణించడానికి అవసరమైన నైపుణ్యాలు సాధించారన్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఫొటోలను చూస్తే వారి ప్రతిభ ప్రస్ఫుటం అవుతోందన్నారు. ఆదివారం ప్రదర్శన కొనసాగుతుందని, నగర వాసులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో సమానత్వ సాధనకు కృషి


విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ఏయూ రెక్టార్ సమత

ఏయూక్యాంపస్: సమాజంలో సమానత్వ సాధనే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత పిలుపునిచ్చారు. ఏయూ సెంటర్ ఫర్ స్టడీ ఆన్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ(సీఎస్ఎస్ఈఐపీ) ఆధ్వర్యంలో 'సోషల్ ఇంక్లూజన్, ఈక్వాలిటీ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ డిజెడ్వాంటేజ్డ్ కమ్యూనిటీస్ ఇన్ ఇండియా' అనే అంశంపై శనివారం నిర్వహించిన రెండు రోజుల సదస్సు ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. దేశంలో కుల, వర్గ, వర్ణ ప్రాతిపదికన ఏర్పాటు జరిగిందని, రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటి నుంచి కొంత మార్పు వచ్చిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి ఫలితంగా అట్టడుగు వర్గాలు సైతం అభివృద్ధిలో భాగం కాగలిగాయని చెప్పారు. సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడానికి విద్యావంతులు, మేధావులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు, విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కేంద్రం సంచాలకుడు డాక్టర్ పి.సుబ్బారావు తదితరులు ప్రసంగించారు.

ఆర్‌ఆర్‌ఆర్‌కు ఆస్కార్.. గొప్ప విజయం

- ప్రముఖ సంగీత దర్శకుడు తమన్


పూజలు నిర్వహిస్తున్న సంగీత దర్శకుడు తమన్

సింహాచలం: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డు రావడంతో తెలుగు సినిమా స్థాయి ఉన్నత శిఖరాలకు వెళ్లిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు తమన్ అన్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా తమన్ మాట్లాడుతూ ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో పాటకు ఆస్కార్ రావడం తెలుగు సినీ పరిశ్రమ గర్వించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం రామ్ హీరోగా.. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు సంగీత దర్శకత్వం వహిస్తున్నట్లు చెప్పారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, సంపంగి శ్రీనివాసరావు తమన్ వెంట ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక సంబరాలు


కళాకారులు అభిషేక్, జోషితలను సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట: మల్లికా మాధుర్య స్వరాలు కల్చరల్ అసోసియేషన్ పంచమ వార్షికోత్సవాల సందర్భంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సాంస్కృతిక సంబరాలు విశేషంగా అలరించాయి. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు నన్నపనేని మల్లికా చౌదరి సారథ్యం వహించిన సభలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న కళా సేవకులను ఘనంగా సత్కరించారు. కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, విజయ్‌నిర్మాణ్ సంస్థ అధినేత ఎస్.విజయ్ కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వ్యాఖ్యాత పి.రాజేంద్రప్రసాద్, సినీ నటుడు ఆర్.యాదకుమార్, చంద్రశేఖర్ పండా, కళారంగ ప్రముఖులు మహమ్మద్ ఖాన్, చెన్నా తిరుమలరావు, మస్తాన్‌రెడ్డి, సన్‌మూర్తి, జె.ఎం.ఆర్ నెహ్రూ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరిలో గాయనీ గాయకులు కె.ఎస్.ప్రకాష్, మల్లికా పాడిన ఈ మూగ చూపేలా, రైల్వే రమణ మల్లిక పాడిన చల్లని గాలి, చంద్రశేఖర్ పాడిన రిమ్‌జిమ్ రిమ్‌జిమ్ హైదరాబాద్, బొమ్మిడి సత్యనారాయణ, శ్వేత పాడిన దంచవే మేనత్త కూతురా, సింహాచలం, మల్లిక పాడిన ఒక్కసారి చెప్పలేవా వంటి మధుర గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

స్పోర్ట్స్ రౌండప్

ఈకోర్సాతో కావలీర్స్ పోరు

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ20 క్రికెట్ ఫైనల్స్‌లో ఈకోర్సా వాల్తేరుతో కావలీర్స్ సీసీ తలపడింది. శనివారం జింక్ గ్రౌండ్‌లో జరిగిన తొలి సెమీస్‌లో మోదమాంబ సీసీ తొమ్మిది వికెట్లకు 118 పరుగులు చేసింది. అకాష్‌వర్మ 38 పరుగులు చేయగా.. డేవిడ్‌రాజు నాలుగు వికెట్లు తీసి హాట్రిక్ సాధించాడు. ప్రతిగా ఈకోర్సా వాల్తేరు ఆరు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. త్రినాథ్ 28, శ్యామ్ 24పరుగులు చేశారు. కిషోర్, అప్పలరెడ్డి రెండేసి వికెట్లు తీశారు. మరో మ్యాచ్‌లో మెట్రో సీసీపై కావలీర్స్ ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది. మెట్రోసీసీ తొమ్మిది వికెట్లకు 161పరుగులు చేసింది. యువన్ 73పరుగులతో రాణించాడు. ప్రతిగా కావలీర్స్‌సీసీ నాలుగు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. పాండురంగరాజు 59 పరుగులు చేయగా అభినవ్ 37 పరుగులు చేశాడు.

2న బాడీలిఫ్టింగ్ పోటీలు

ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ పోటీలు ఏప్రిల్ 2 న జరగనుంది. 55–80 కేజీలు పైబడిన వారికి ఏడు గ్రూప్‌ల్లో పోటీలు మెన్‌కు జరగనున్నాయి. ఆంధ్రబాడీ లిఫ్టింగ్ సంఘం ఆధ్వర్యంలో మాస్టర్స్‌కు 40నుంచి 50+ వారికి మూడు గ్రూప్‌ల్లో పోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ప్రవేశరుసుం చెల్లించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా మహిళాదినోత్సవం

క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు క్రీడాంశాల్లో పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉష , శోభారాణి, సెట్విస్ సీఈవో పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వీడీఎస్ఏ చీఫ్ కోచ్ సూర్యారావు పర్యవేక్షించారు.

ఒక్క కార్టూన్‌తో అనేక భావాలు


కార్టూన్ వాచ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు

అల్లిపురం: ఒక్క కార్టూన్‌తో నవరసాలు పలికించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. హాస్యం, వినోదం, రాజకీయం.. ఇలా ఏదైనా కార్టూన్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. మేఘాలయా హోటల్లో శనివారం జరిగిన కార్టూన్స్ వాచ్ కార్టూన్స్ ఫెస్టివల్–2023ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా కార్టూన్ వాచ్ పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్టూన్ వాచ్ ఫెస్టివల్‌ను విశాఖలో నిర్వహించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కార్టూన్ వాచ్ కుటుంబం ఎడిటర్ త్రయంబకశర్మను గౌరవించుకోవడం ముదావహం అన్నారు. చత్తీస్‌ఘడ్ టూరిజం ఎండీ అనిల్ సాహు, డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ కార్టూన్లు ఎన్నో భావాలను తెలియజేస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు కార్టూనిస్టులను సత్కరించారు. కార్టూనిస్టులు ఎం.శంకర్‌రావు, టి.వెంకటరావు, శ్రీహరి వెంకటరమణలకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు.